ప్రజాశక్తి

గురువారం 28 సెప్టెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు



జాషువా విగ్రహానికి పూలమాలలేసి నివాళు లర్పిస్తున్న బాలసుబ్రహ్మణ్యం, కెఎస్ లక్ష్మణరావు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

సాంస్కృతిక కాలుష్యంపై జాషువా స్ఫూర్తితో పోరాటం

- జయంతి సభలో పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం
- ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డికి జాషువా కవితా పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు

సమాజంలో పెంచి పోషిస్తున్న సాంస్కృతిక కాలుష్యంపై గుర్రం జాషువా సాహిత్య స్ఫూర్తితో అభ్యుదయ వాదులు, సాహితీవేత్తలు పోరాడాలని పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో గుర్రం జాషువా 128వ జయంతిని పురస్కరించుకొని 'జాషువా సాహిత్యం- సామాజిక న్యాయం' అంశంపై సభ నిర్వహించారు. తొలుత జాషువా విగ్రహానికి విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, తదితరులు

మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డికి ఈ ఏడాది జాషువా కవితా పురస్కారాన్ని వి.బాలసుబ్రహ్మణ్యం ద్వారా ప్రదానం చేశారు. కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సభలో వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశంలో కులం, వర్గం వేరుకాదని, అందుకే కులాన్ని, ఆర్థిక అసమానతల్ని జాషువా తన సాహిత్యంలో కలిపి రచనలు చేసి ఉంటారని అన్నారు. జాషువా ఒక వర్గానికి, ఒక తరగతికి పరిమితమైన వాడు కాదని, సమగ్రమైన కవి అని కొనియాడారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలోనూ ఇప్పటికీ కులం మారలేదన్నారు. ఒక పథకం ప్రకారం సోషల్ ఇంజినీరింగ్‌ను వ్యవస్థీకృతం చేయటానికి ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. మూఢనమ్మకాలు, చరిత్ర పట్ల తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో నేటి సాంస్కృతిక కాలుష్యాన్ని అర్థం చేసుకొని, జాషువా స్ఫూర్తితో అందరం న్యాయం కోసం పోరాడాల్సిన

2లో

నరసరావుపేటలో నిరసన ప్రదర్శన చేస్తున్న వామపక్షాలు

విద్యుత్ భారాలు తగ్గించకుంటే ఇంటిదారే

ప్రభుత్వానికి వామపక్షాల హెచ్చరిక - గుంటూరు, పల్నాడు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్ భారాలు మోపితే గత ప్రభుత్వాలకు పట్టిన గతే పడుతుందని వామపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. విద్యుత్ అదనపు ఛార్జీలు, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు, పల్నాడు కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. గుంటూరులో ధర్నాకు సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షత వహించగా సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహారావు, ఎంసిపిఐ (యు) నాయకులు కాల్వ శ్రీధర్, సిపిఐ (ఎంఎల్) నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు మాట్లాడారు. విద్యుత్ ఛార్జీలను ప్రజలు భరించే స్థితిలో లేరని, బిల్లు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయని తెలిపారు. అంధకారంలోనైనా ఉండటానికి ఇష్టపడుతున్నారన్నారు. అసలు బిల్లు కంటే అదనపు బిల్లులే ఎక్కువగా ఉంటున్నాయని, ఆఖరికి రీడింగ్ తీసే ఉద్యోగుల జీతాలు కూడా ప్రజల నుండే వసూలు చేస్తోందని విమర్శించారు. గతంలో రూ.500 వస్తే ఇప్పుడు రూ.5 వేలు బిల్లు వస్తోందని, ఇంత దుర్మార్గంగా గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2000 సంవత్సరంలో విద్యుత్ ఉద్యమం ప్రభావంతో ఆ తర్వాత అధికారం చేపట్టిన ఏ ప్రభుత్వమూ విద్యుత్ చార్జీలు పెంచటానికి సిద్ధపడలేదని, కానీ ఈ ప్రభుత్వం ప్రజాభీష్టానికి భిన్నంగా భారాలు మోపుతోందని విమర్శించారు. ప్రైవేటు కంపెనీల లాభాల కోసం చేసుకున్న ఒప్పందాల ఫలితంగా ఏర్పడిన లోటును కూడా ప్రజల నుండి వసూలు

2లో

గుంటూరులో ధర్నా శిబిరంలో వామపక్షాల నాయకులు

రూ.1.3 కోట్ల నకిలీ మందులు స్వాధీనం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

మండలంలోని కట్టెంపూడిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులను తయారు చేస్తున్న గోడౌన్‌లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. రూ.1.3 కోట్ల విలువైన నకిలీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామచంద్రారెడ్డి తెలిపారు. తయారీదారుడైన రామరంజన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ ఏవో రమణ కుమార్, మండల వ్యవసాయాధికారి డి.వెంకట్రామయ్య పాల్గొన్నారు.

నరసరావుపేటలో యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పంట రుణాల కోసం కౌలురైతుల ఆందోళనలు

అపార్ట్‌మెంట్లలో పోలింగ్ కేంద్రాలు

రాజకీయ పార్టీలతో సమావేశంలో కలెక్టర్ 8 లో

గాయంలో గాజు ముక్కలు తీయకుండానే కుట్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బాధిత బాలిక

చేతిలో ఉన్న గాజు ముక్కలు తీయకుండా వైద్య సిబ్బంది కుట్లు వేసిన ఘటన పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో బుధవారం వెలుగు చూసింది. స్థానిక 20 వార్డులో నివాసం ఉంటున్న గుండా సాంబశివరావు, నాగలక్ష్మి దంపతుల కుమార్తె కీర్తి ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. ఆగస్టు 15న బాలిక గాజులు వేసుకుటుండగా అవి పగిలి చేతికి తీవ్ర గాయమైంది. బాలికను తల్లిదండ్రులు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. గాయాన్ని శుభ్రం చేసిన సిబ్బంది కుట్లు వేశారు. అయితే కొద్దిరోజులకు బాలిక చేతికి వాపు రావడం, నొప్పి కూడా పెరగడంతో ట్యాబ్లెట్లు వాడుతున్నారు. అయినా తరచూ నొప్పి రావడం, వాపు తగ్గకపోవడంతో బుధవారం స్థానికంగా ఉన్న ముళ్లు తీసే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వారు గాయంలో గాజు ముక్కలు ఉండటాన్ని గమనించి వాటిని తొలగించి మళ్లీ కుట్లు వేశారు. దీనిపై ఆస్పత్రి వైద్యులను సంప్రదించగా నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని బాలిక తల్లిదండ్రులు వాపోతున్నారు.

దళితులతో మాట్లాడుతున్న జి.రవిబాబు

రేపు చలో విజయవాడకు తరలిరండి

మహాధర్నా జయప్రదం కోసం కెవిపిఎస్ ప్రచారం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

దళితుల సామాజిక న్యాయం కోసం విజయవాడలో శుక్రవారం నిర్వహించే మహాధర్నాకు పెద్దఎత్తున తరాలి రావాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు కోరారు. ఈ మేరకు బుధవారం నరసరావుపేట మండలం దొండపాడు, పెద్దరెడ్డిపాలెం, ములకలూరు, పాలపాడు గ్రామాల్లో పట్టణంలోని కంభంపాలెంలో కరపత్రాలు పంపిణీతో ప్రచారం చేశారు. రవిబాబు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో, రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దళితులకు రక్షణగా ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టాన్ని నీరుగార్చే కుట్రలు చేస్తున్నారని చెప్పారు. అట్రాసిటీ కేసులో నిందితులకు స్టేషన్ బెయిలు ఇవ్వటం అన్యాయమన్నారు. ఎస్సీలకు ఉచిత గృహ విద్యుత్ 300 యూనిట్లకు పెంచాలని, పాత బకాయిలు రద్దు చేయాలని, డప్పు, చర్మకారులకు ఇస్తున్న పెన్షన్ రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి ఎస్సీ కాలనీకి శ్మశాన స్థలాన్ని కేటాయించాలని, సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సాగునీరు రాక, దళిత మహిళా కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి హామీ పనులు కల్పించాలని అన్నారు. ఈ అంశాలపై నిర్వహించే ధర్నాకు అందరూ తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఆంజనేయులు, విద్యాసాగర్, నవీన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవం ర్యాలీ

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలో బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం, స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎంపిపి ఎం.మేకల హనుమంతరావు మాట్లాడుతూ ఏ ప్రాంతంలోనైనా పర్యాటక రంగం అభివృద్ధి చెందితే ఆ ప్రాంత ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. దీనిద్వారా అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అమరావతి ప్రాంతం చారిత్రకంగా, సాంస్కృతికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని, ఎన్నో ప్రాచీన రాజవంశాలు అమరావతి వేదికగా పరిపాలన కొనసాగించాయని గుర్తు చేశారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో అమరావతి ఉండటం వలన ప్రాచీన నాగరికత నుండి అమరావతికి అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్నదని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమరావతిలోని పర్యాటక రంగం అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని కోరారు. ప్రతి ఒక్క పౌరుడు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సామాజిక పరిశుభ్రత పాటించాలని కోరారు. 90 శాతం వ్యాధులు అపరిశుభ్రత కారణంగానే వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి, తహశీల్దార్ విజయశ్రీ, ఎంఇఒ శివబాబు, ఇఒపిఆర్‌డి గంగాధర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, టూరిజం అధికారులు, మునుగోడు మాజీ సర్పంచ్ ఎం.శివశంకర్, పి.శ్రీనివాస్, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, గేయాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

సాంస్కృతిక కాలుష్యంపై జాషువా స్ఫూర్తితో పోరాటం

సభికులు

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఉందన్నారు. లేదంటే భవిష్యత్ అంధకారం అవుతుందని చెప్పారు. ఈ క్రమంలోనే జాషువా కవిత్వాన్ని అందరూ అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

పురస్కార గ్రహీత ప్రొఫెసర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో జాషువా, గురజాడ వంటి వారి అవసరం ఎంతో ఉందన్నారు. ఒకప్పుడు భారతీయులు బ్రిటీషు వారితో పోరాడారని, ఇప్పుడు భారతీయులతోనే పోరాడాల్సి వస్తోందని అన్నారు. జాషువా లాంటి వారు నేడు ఉండి ఉంటే దేశద్రోహులని ముద్ర వేసేవారని అన్నారు. అసమానతలున్న సమాజాన్ని ఎందుకు సృష్టించావని ప్రశ్నించిన జాషువా దేవుడిపై యుద్ధ ప్రకటించాడని చెప్పారు. కులభావన ఉన్న భారతదేశంలో ఆర్థిక, రాజకీయ విప్లవం కంటే ముందుగా సాంఘిక విప్లవం రావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సాంఘిక విప్లవం రాకుండా ఆర్థిక, రాజకీయ విప్లవం వచ్చినా అది నిలవదని జాషువా భావనగా వివరించారు. జాషువా కోరుకున్నట్లు కుల, మతాలకు అతీతంగా దేశం పున:నిర్మాణం జరగాల్సిన తరుణంలో అందుకు భిన్నంగా తిరోగమనంలో నిర్మించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. జాషువా శ్రామికులు, దళితులు, మహిళలు, నష్టపోయిన వారి పక్షపాతి అని, స్వచ్ఛమైన న్యాయకవి అని కొనియాడారు. జాషువా సాహిత్యాన్ని చాలా ఆలస్యంగా గుర్తించామని, ఇప్పటికైనా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు.

జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ గుర్రం జాషువా గుంటూరు వాసి కావటం గర్వకారణం అన్నారు. 2012 నుండి జాషువా పేరుతో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు, సాహిత్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. భవిష్యత్‌లో ఈ వేదిక ద్వారా బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కెవిఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గతంలో జాషువా కవితా పురస్కారాన్ని గోరంటి వెంకన్న, రచయిత చంద్రబోస్, సుద్దాల అశోక్ తేజ, కత్తిపద్మారావు, నల్లిధర్మారావు, ఓల్గా వంటి అనేక మంది సామాజిక కవులు, రచయితలకు అందచేసినట్లు చెప్పారు. ఈ ఏడాది ప్రముఖ సామాజిక కవి, సాహితీ విమర్శకులు చంద్రశేఖర్‌రెడ్డికి పురస్కారం ఇవ్వటం ముదావహమని అన్నారు. సభలో జాషువా సాహిత్య తెలుగు అనువాదకురాలు హేమలత, జాషువా విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నూతలపాటి కాళిదాసు, పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు. సభలో తొలుత ప్రజానాట్య మండలి కళాకారులు జగన్, ఎస్.పద్మ, డి.శ్రీనివాస్, లూథర్‌పాల్ తదితరులు అభ్యుదయ గేయాలు ఆలపించారు.

మాట్లాడుతున్న సూరిబాబు

కెవిపిఎస్ ఆధ్వర్యంలో జాషువాకు నివాళులు

ప్రజాశక్తి - అమరావతి

విశ్వనరుడు, మహాకవి గుర్రం జాషువా 128వ జయంతి సభ అమరావతి తల్లం బ్రహ్మయ్య స్మార్క భవనంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజాసంఘాల కన్వీనర్ బి.సూరిబాబు మాట్లాడుతూ సమాజంలో ప్రతి మనిషినీ గౌరవించాలని, మనుషుల మధ్య కుల, ఆర్థిక అసమానతో లేని సమాజం కావాలని జాషువా కోరుకున్నారని చెప్పారు. శ్రమజీవుల పడుతున్న కష్టాల గురించి, కుల వివక్షత అంటరానితనం రూపుమాపటం కోసం సాహిత్యాన్ని రాశారన్నారు. జాషువా తన జీవిత కాలంలో అనేక అవమానాలకు, వివక్షకు గురయ్యారని గుర్తు చేశారు. మనుషులంతా ఒకటిగా జీవించాలని కాంక్షించారని చెప్పారు. గబ్బిలం, ఫిరదౌసి రచనలు నేటికీ సాహిత్యపురులకు స్ఫూర్తిగా ఉన్నాయని చెప్పారు. స్త్రీలు వంటింటి పరిమితం కాకుండా పురుషులతో పాటు సమానత్వంగా గుర్తించినప్పుడే దేశ అభివృద్ధికి తోడ్పడుతుందని, స్త్రీ స్వేచ్ఛ, హక్కుల కోసం జాషువా కృషి చేశారని అన్నారు. నేడు పాలక పార్టీలు ప్రజల మధ్య చీలికలు తెస్తున్నాయని, మహిళలకు రక్షణ లేకుండా చేస్తున్నాయని విమర్శించారు. కుల వివక్ష నేటికీ కొనసాగుతోందని అన్నారు. ఈ జాఢ్యాలకు వ్యతిరేకంగా జాషువా స్ఫూర్తితో పోరాడాలని, జాషువా సాహిత్యాన్ని అధ్యయం చేయాలని అన్నారు. సభకు కెవిపిఎస్ మండల కార్యదర్శి ఎస్.రాజుకుమార్ అధ్యక్షత వహించగా ఎస్‌కె.రఫీ, ఎం.సుబ్రహ్మణ్యం, నవీన్, వెంకటేశ్వరరాజు, పి.సత్యనారాయణ, మోహిద్దీన్‌వలి పాల్గొన్నారు. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

విద్యుత్ భారాలు తగ్గించకుంటే ఇంటిదారే

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోందని మండిపడ్డారు. ప్రతినెలా ట్రూ ఆప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుందని విమర్శించారు. ఒకవైపు ప్రతినెలా బటన్ నొక్కి సంక్షేమ పథకాలు ఇస్తూ, మరోవైపు ధరలు పెంచి, ప్రజల నుండి అంతకు మించి వసూలు చేస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ వామపక్షాలు, ఇతర ప్రజా సంఘాలు రోడ్లపైకి వస్తే అత్యంత పాశవికంగా అడ్డుకుంటున్నారన్నారు. అంగన్‌వాడీలు, ఆశాలు, విద్యార్థులు ఇలా వివిధ వర్గాల ప్రజలు వారి సమస్యలు చెప్పుకోవటానికి రోడ్లపైకి వస్తే పోలీసుల్ని ప్రయోగించి అడ్డుకుంటున్నారని, కొందర్ని ఇళ్ల వద్దే నిర్బంధిస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వం పోలీసు రాజ్యం నడుపుతుందని మండిపడ్డారు. ప్రభుత్వం ఇదే ధోరణి అవలంబిస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే పడుతుందని, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్నాలో సిపిఎం జిల్లా, నగర నాయకులు వై.నేతాజి, ఎన్.భావన్నారాయణ, ఎస్.ఎస్.చెంగయ్య, ఎం.రవి, ఇ.అప్పారావు, ఎన్.శివాజీ, బి.వెంకటేశ్వరరావు, ఎం.ఎ.చిష్టీ, కె.అజయ్‌కుమార్, బి.ముత్యాలరావు, కె.శ్రీనివాస్, సిపిఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక ధర్నా చౌక్ వద్ద నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ సాగింది. కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు అధ్యక్షత వహించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు గత ప్రభుత్వంపై బాదుడే బాదుడు అంటూ విమర్శలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి సిఎం అయ్యాక ఈ నాలుగున్నరేళ్లలో అనేకసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేశారని మండిపడ్డారు. గతంలో వినియోగించిన విద్యుత్‌కు సర్దుబాటు చార్జీల పేరుతో ఇప్పుడు వసూలు చేస్తున్నారని, అసలు బిల్లు కంటే అదనపు బిల్లులే అధికంగా ఉంటున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ప్రజా సమస్యలను విస్మరించి అదనపు భారాలు వేయడం అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. కేంద్రంలోని బిజెపి చెప్పినట్లు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం తూచ తప్పకుండా అమలు చేస్తోందని, విద్యుత్ భారాలు దాని ఫలితమేనని అన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్, ఎంసిపిఐ (యు) జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్‌బాష మాట్లాడుతూ కార్పొరేట్‌లకు లాభాలు చేకూర్చేందుకు స్మార్ట్ మీటర్లు తెస్తున్నారని అన్నారు. సమ్మెలపై పోరాడుతున్న వారిపై నిర్బంధం ప్రయోగిస్తున్నారని, నిరసన హక్కులను హరిస్తున్నారని, ఈ విధానాలను మార్చుకోకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఎస్.ఆంజనేయులు నాయక్, జి.రవిబాబు, మాట్లాడారు. గతంలో రూ.500లోపున్న బిల్లులు ఇప్పుడు రూ.1500 వరకూ వస్తున్నాయని, బిల్లులను చూస్తేనే షాక్ కొడుతోందని అన్నారు. వినియోగించుకున్న దానికి మించి వేస్తున్న బిల్లులను ఆపేయాలని కోరారు. ఇప్పటికే నిత్యావసరాల ధలు ఆకాశానికి అంటుతున్నాయని, సామాన్యులపై విద్యుత్ ఛార్జీలు భారమై చెల్లించలేకపోతున్నారని చెప్పారు. కూలీనాలి చేసుకుని బతికేవారు తమకొచ్చే కొద్ది మొత్తాలను విద్యుత్, గ్యాస్‌కే ఖర్చు చేస్తే వారి జీవనం ఎలా గడవాలని ప్రశ్నించారు. ప్రజల రక్తాన్ని పీల్చేలా ప్రభుత్వాల భారాలున్నాయని, వీటిని వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం అంటే రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్‌కు ఎగనామం పెట్టడానికేనన్నారు. బిల్లును రైతులకు నగదు బదిలీ చేస్తామని చెబుతున్నా అది నమ్మశక్యం కాదని, గ్యాస్ సబ్సిడీ ఇందుకు నిదర్శనమని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు డి.శివకుమారి, జి.మల్లేశ్వరి, పి.మహేష్, జి.బాలకృష్ణ, హనుమంతరెడ్డి, సిలార్ మసూద్, ఎం.ఆంజనేయులు, కె.నాగేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరాజు, పి.వెంకటేశ్వర్లు, జి.పిచ్చారావు, ఇ.అప్పిరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, షేక్ నాసర్‌బి, ఆంజనేయరాజు, జిలాని మాలిక్, సిపిఐ నాయకులు ఎస్.సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించలేకపోతున్నాం..

చిరు వ్యాపారి ముంద్రు వెంకటేశ్వర్లు

విద్యుత్ బిల్లులు అధికంగా వస్తుండడంతో చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కుటుంబంపై అదనపు భారం పడుతోంది. నేను నిర్వహిస్తున్న కర్రీ పాయింట్‌కు గతంలో నెలకు రూ.2 వేలు బిల్లు వస్తే ఇప్పుడు అదే యూనిట్లకు రూ.3500పైగా వస్తోంది. చిరు వ్యాపారమే అయినా అదనపు విద్యుత్ లోడు అంటూ కొంత నగదు డిపాజిట్ చేయించుకున్నారు.

పి.పద్మ, గహిణి, రామిరెడ్డిపేట, నరసరావుపేట.

నెల నెలా పెరుగుతున్న కరెంట్ బిల్లు వల్ల ఇంట్లో ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయి. బిల్లులు చూసి బాధపడని నెలలేదు. చాలీచాలని ఆదాయాలతో బతుకుతున్న సగటు కుటుంబాలకు విద్యుత్ బిల్లు భారంగా మారుతున్నాయి.

సీఎం ఫొటో మార్ఫింగ్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి-గుంటూరు సిటి

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోటోను మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మార్ఫింగ్ చేసిన సీఎం ఫొటోను ఓ సినిమాలోని ఓ వీడి యోకి జతచేసి అసభ్యకరమైన పదాలతో కామెంట్ లు పెట్టి నందుకు గాను స్థానిక విజయపురి కాలనీలో నివసించే పిడికిటి శివపార్వతి అలియాస్ లక్ష్మి గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఉద్దేశ్యపూరకముగా ముఖ్య మంత్రి ని కించపరచే విధంగా, పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమం ఫేస్ బుక్ లో పోస్ట్ చేసినందుకు లక్ష్మి గణేష్ పై నగరానికి చెందిన ముగ్గురు వైసిసి కార్యకర్తలు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో లక్ష్మిగణేష్‌ను హాజరు పరిచినట్లు తెలిపారు.

అప్పు తిరిగి ఇవ్వట్లేదని దాడి

ప్రజాశక్తి-గుంటూరు సిటీ: అప్పు తిరిగి ఇవ్వలేదని ఇంట్లోకి వచ్చి దాడి చేసిన సంఘటన పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవాపురం రెండో లైనుకు చెందిన మిట్టపల్లి నాగ వెంకటకృష్ణ ,తన బాబాయ్ శివకుమార్ ఆర్థిక ఇబ్బందులతో తన వ్యాపార భాగ స్వాములైన తొండపు మురళి, గోపవరపు రాజేష్ వద్ద కొంత డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. శివకుమార్ డబ్బులు ఇవ్వట్లేదని గురువారం సుమారు 11 గంటలకు గోప వరపు రాజేష్, తొండేపు మురళి తో పాటు మహిళలు, నాగ వెంకటకృష్ణ ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న సోఫా, అద్దాలు, టీపాయి పగలగొట్టి ఇంట్లో ఉన్న సామాన్లు చిందరవందర చేశారు. వెంకటకృష్ణతో పాటు అతనిభార్యపై భౌతిక దాడి చేశారని, దీనిపై కేసు నమోదు చేసినట్లు పట్టాభిపురం పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు.

ప్రజాశక్తి - గుంటూరు సిటి: జెకెసి కళాశాల విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని కళాశాల పాలకమండలి అద్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు గురువారం కళాశాలలో జరిగిన దీక్షారంబ్ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీ మోహన్ మాట్లాడుతూ కళాశాలలోని గ్రంథాలయం, ప్రయోగశాలలను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, ఇ.నాగేశ్వరరావు పరీక్షల నియంత్రణ అధికారి ఎస్ఆర్‌కె ప్రసాద్ త దిత రు లు పాల్గొన్నారు.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 37,947
మిర్చి ఎగుమతి	: 39,184
మిర్చి నిల్వ	: 11,017

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,500 - 23,200
నెం.5	11,500 - 19,800
273	18,000 - 21,000
341	9,500 - 22,000
సూపర్ 10	10,500 - 15,500
నాన్ ఎసి	
తేజ	10,000 - 24,000
బడిగి	11,000 - 26,000
దేవనూరు డీలక్స్	18,500 - 21,000
తాలుకాయలు	5,000 -14,500
ఎసి	
334	11,000 - 23,500
273	19,000 - 20,000
341	15,000 - 23,000
తేజ	11,500 - 24,300
బడిగి	16,700 - 26,000
దేవనూరు డీలక్స్	18,000 - 20,000
తాలుకాయలు	7,000 -13,500

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి - వినుకొండ

గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి వినుకొండ మండలం కొత్తపాలెం వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమా దంలో అన్న దమ్ములు మృతి చెందారు. మండలంలోని కొప్పు కొండకి చెందిన సోదరులు మర్రి చిన్న కొండలు (26), మర్రి ముసలయ్య (22) ఇరువురు ద్విచక్ర వాహ నంపై నేల గంగవరం నుండి వినుకొండ వైపు వస్తుం డగా ఈ ప్రమాదం జరిగింది. నీల గంగవరంలో జరి గిన శుభకార్యానికి ఒకే కుటుం బంలోని అన్నదమ్ములు మర్రి పెద్ద ఏడుకొండలు, భార్య ఆదిలక్ష్మి ఒక ద్విచక్రవాహనంపై, చిన్న కొండలు, ముసలయ్యలు మరో మోటార్ సైకిల్ పై వెళ్లి వస్తుండగా ఎదురుగా వస్తున్న మినీ లారీ ఢీ కొట్ట డంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అన్నదమ్ములు మృతి చెం దారు. పెద్ద ఏడుకొండలు పరిస్థితి విషమంగా ఉండ టంతో గుంటూరుకు తరలించినట్లు వైద్యులు తెలి పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కూలి పనుల నిమిత్తం కొప్పుకొండ నుండి వినుకొండకు వచ్చి వీరు నివ సిస్తున్నారు. తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

పెదకూరపాడులో విలేకరిపై దాడి

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండల కేంద్రమైన పెద కూరపాడులో బుధ వారం ఆంధ్ర ప్రభ జర్నలిస్ట్ చెన్నం శెట్టి బాజీపై గాత్రం కాంతారావు అనే వ్యక్తి దాడి చేసిన సంఘటన చోటుచేసు కుంది. స్థానికులు తెలిపిన వివ రాల ప్రకారం పెదకూరపాడు మండల ఆంధ్రప్రభ జర్న లిస్టుగా వర్క్ చేస్తున్న చెన్నంశెట్టి బాజీ ఉదయం 8 గంటల సమయంలో తన ఇంటి వద్ద నుండి కచేరి సెంటర్‌లోని తన షాపు వద్దకు స్కూటీపై తన తాతయ్యను ఎక్కించుకొని వెళ్తుండగా పథకం ప్రకారం కాంతారావు, అతని అనుచరులు అనుముల మహేష్, అనుముల రామకృష్ణ అనే ఇద్దరు వ్యక్తులతో కలిసి స్థానిక సాయిబాబా గుడి వద్ద గల చప్టా దగ్గర కర్రలతో దాడి చేయగా బాజీకి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. జరిగిన సంఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. క్షతగాత్రుడైన బాజీని చికిత్స నిమిత్తం అమరావతి గవర్నమెంట్ హాస్పిటల్ కు తం`లించినట్లు తెలిపారు. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీ సులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతి

ప్రజాశక్తి-రొంపిచర్ల

గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతి చెందిన సం ఘటన హైవే రోడ్డు పరిధిలో మండలంలో సంతగుడిపాడు లో బుధవారం జరిగింది. మండలంలోని సంతగుడిపాడు కి చెందిన మోదుగుల లక్ష్మీనారాయణ కు చెందిన గేదె మేత కోసం హైవే రోడ్డు మీదుగా పొలానికి వెళుతుండగా వెనుక వైపు నుండి వేగంగా వస్తున్న గుర్తుతెలియని వాహనం గేదె ను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలు పాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.75 వేలకు పైగా ఉందని బాధితుడు లక్ష్మీనారాయణ అన్నారు. తమ కుటుం బానికి జీవనాధారం ఇదేనని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ కుటుంబాని ఆదుకోవాలని కోరారు.

'ప్రజలకు మరోవరం ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-తెనాలిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజల ఆరోగ్య క్షేమాలను తెలుసుకొని ప్రభుత్వ యాప్ లో పొందుపరచాలని అధికారులకు సూచించారు. బిపి, షుగర్, హిమోగ్లోబిన్ నమూనాలు సేకరించి పిహెచ్సి నిర్వహకులు ద్వారా పరీక్షలు చేయిం చడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 5న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తల` ఎట్టిన ప్రాంతాలలో ప్రజలను తీసుకుని వచ్చి ఉచితముగా చికిత్స చేయి స్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి ః సి హెచ్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - అచ్చంపేట

రాముని గెలవాలంటే రక్షతలంతా అవు తారంటూ రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం సాయంత్రం అచ్చంపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో రూ.2 కోట్ల 50 లక్షలతో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల గురించి ప్రస్తావించారు. అధికార దాహంతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతికి పాల్పడి జైలు పాలయ్యారన్నారు సిబిఐ దర్యాప్తులో అనేక వాస్తవాలు బయట పడటంతో అరెస్టు తప్పదని అనేక కుయుక్తులతో కోర్టులను రిమాండ్ కు పంపిన న్యాయ మూర్తులు పైన కూడా అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక ప్రతిపక్షానికి దత్తపుత్రుడైన పవన్ కళ్యాణ్ వైసిపిని ఓడించాలని అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాజధాని పేరుతో వేల ఎకరాలు బినామీర్ల పేర్లతో టిడిపి నాయకుల చేతుల్లోకి వెళ్ళాయన్నారు కార్యక్రమంలో నర్సరావుపేట ఎమ్మెల్యే గోపు శ్రీని వాస్ రెడ్డి పోలీసు ఉన్నతాధికారులు నియోజక వర్గ ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ఇసుక అక్రమ రవాణ.. లారీ సీజ్

ప్రజాశక్తి-తాడికొండ

మండలంలోని కం తేరు మీదుగా ఎలాంటి మైనింగ్ అనుమతులు బిల్లులు లేకుండా ఇసుకను అక్ర మంగా తరలిస్తున్న లారీని బుధవారం ఎస్ఈబి అది.కారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మల్లికార్జున రావు ఆధ్వ ర్యంలో దాడులు నిర్వహించారు. 30 టన్నుల ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీని, డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని తాడికొండ పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్ ఈ బి సిఐ మారయ్య బాబు తెలిపారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరుజిల్లా, పొన్నూరు మండలం, బ్రాహ్మణ కోడూరుకి చెందిన దాసరి ప్రసన్న విజయ @ ఇందుమతికి చెందిన దస్తావేజులు మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో రిజిష్టర్ కాబడిన దస్తావేజు నెంబర్లు 5878/2023, 2566/2014 గల దస్తావేజులను 5-9-2023 తేదీన జిరాక్స్ నిమిత్తం బ్రాహ్మణ కోడూరు నుండి పొన్నూరు మండల కార్యాలయానికి ఆటోలో వెళుచుండగా జారి పడిపోయినవి. తిరిగి ఎంత వెదికినా దొరకలేదు. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఇట్లు
ప్రసన్న విజయ, బ్రాహ్మణకోడూరు,
పొన్నూరు మండలం, గుంటూరుజిల్లా.

మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో
E.A. No. 36/2023 in E.P. No. 21/2023 in O.S. No. 24/2018

Between
నేరెళ్ల పాపారావు .... DHR
Vs
లింగమల్లు సూర్య ప్రకాశరావు ...JDR

To, JDR
లింగమల్లు సూర్య ప్రకాశరావు, తండ్రి : సుబ్బారావు, డోర్ నెం. 1-1-75, కుర్రావారివీధి, నాజరుపేట, తెనాలి - 522 201. గుంటూరుజిల్లా, ఎ.పి.

పై నెంబరు ఇ.పి.లో మీకు శ్రీ కోర్టుద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు ఇ.పి.లో Order 21, Rule 54 (1A) C.P.C. నోటీసులు పంపించినను, మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, పై కోర్టు వారు ఆర్డరు వేస్తూ ది.17-10-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు ఇ.పిని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.ఔ

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది: 17-10-2023

ముదిగొండ శంభుప్రసాద్,
డిహెచ్‌ఆర్ తరపు అడ్వకేట్, తెనాలి.

ప్రకటన

మా క్లయింట్ శ్రీ దేవరపల్లి విజయకుమారరెడ్డి గారి కుమారుడు దేవరపల్లి పార్ధసారధి రెడ్డి, నివాసం : డోర్ నెం. 3-68, కుంచనపల్లి, గుంటూరు జిల్లా వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా లేటు పులగం పున్నారెడ్డి గారి కుమారుడు పులగం సందీప్‌రెడ్డి మరియు లేటు పులగం పున్నారెడ్డి గారి కుమారుడు పులగం సాయిరాంరెడ్డి, నివాసం : డోర్ నెం. 3-17, కుంచనపల్లి గ్రామం, తాడేపల్లి మండలం, గుంటూరుజిల్లా వాస్తవ్యులు పులగం అప్పిరెడ్డి గారి కుమారుడు అయిన పులగం పున్నారెడ్డి గారి ప్రథమ కుమారుడు అయిన పులగం సందీప్‌రెడ్డి నాకు మనమడై ఉన్నాడు. నాకు రిజిష్టర్ దస్తావేజు నెం. 2574/1999 ద్వారా పొంది మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిస్ట్రేషన్ నా పేరుమీద అయినది. కుంచనపల్లి గ్రామం, రీ సర్వే నెం. 68/1 చ.గ. 149.8లు మంగళగిరి సబ్ రిజిష్టర్ ఆఫీసులో ది. 03-12-2016న నా మనుమడుకు దఖలు దస్తావేజు డాక్యుమెంట్‌నెం. 3178/2016 చేసియున్నారు. మరియు పులగం అప్పిరెడ్డి గారి కుమారుడు అయిన పులగం పున్నారెడ్డి గారి ద్వితీయకుమారుడు అయిన పులగం సాయిరాంరెడ్డి నాకు మనుమడై యున్నాడు. నాకు రిజిష్టర్ దస్తావేజు 2574/1999 ద్వారా పొంది మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిస్ట్రేషన్ నా పేరుమీద అయినది. కుంచనపల్లి గ్రామం, రీ సర్వే నెం. 68/1 చ.గ. 213.3లు మంగళగిరి సబ్ రిజిస్టర్ ఆఫీసులో ది. 03-12-2016న నా మనుమడుకు దఖలు దస్తావేజు డాక్యుమెంట్ నెం. 3177/2016 చేసియున్నారు. దీనిలో 5 డబుల్ బెడ్‌రూమ్‌లు మరియు 5 సింగిల్ బెడ్‌రూమ్‌లు నిర్మించియున్నారు. కావున ఈ దిగువ షెడ్యూలాస్తులపై ఎవ్వరికైనా ఎటువంటి ఆక్షేపణలు, క్లెయిమ్‌లు, మైనర్ వారసత్వపు వగైరా చెల్లదగు హక్కులు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ లగాయతు 7 రోజులలోపు చేరునట్లుగా రిజిస్టర్ పోస్టు తిరుగు రశీదు ద్వారా దిగువ చిరునామాకు తెలియపరచవలసినది. గడువుతేదీ దాటివచ్చు అభ్యంతరములు, ఆక్షేపణలు, వగైరాలు మా క్లయింట్‌ను బద్దులను చేయజాలవని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్

1వ అయిటమ్ : గుంటూరుజిల్లా, మంగళగిరి సబ్ డివిజన్ యిలాకా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన కుంచనపల్లి గ్రామ రీసర్వే నెం. 68/1రు య.64.61 సెంట్లులో ఎండోమెంట్ వారి భూమి చ.గ. 666.6లు పోను మిగిలియున్న భూమిలో నాకు హక్కు కలిగిన చ.గ. 357.2లులో కుంచనపల్లి గ్రామ పాత డోర్ నెం. 3-31రుగా ప్రసుత్త స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు :
తూర్పు : ఆత్మకూరి పేరయ్యగారి ఆస్తి హద్దు
దక్షిణం : 2వ అయిటమ్ జాయింట్ దారి అ. 7.6లు కొంత వరకు మరియు పులగం సందీప్‌రెడ్డి
పడమర : కూరపాటి సాంబిరెడ్డి గారి ఆస్తి.
ఉత్తరం : పులగం శివారెడ్డి గారి ఆస్తి.
యీ నాలుగు హద్దుల మధ్య చ.గ. 184.6 లు లేక చ.మీ. 154.34ర్లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమున్నూ. దీనిలో 5 డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించియున్నారు.

2వ అయిటమ్ : డిటో షెడ్యూల్ దాఖలా జాయింట్ నడక దారికి హద్దులు :
తూర్పు : పంచాయతీ రోడ్డు హద్దు
దక్షిణం : శీలం శంకరరావు యితరులకు విక్రయించిన ఆస్తి హద్దు.
పడమర : పులగం సందీప్‌రెడ్డికి దఖలు పరచిన ఆస్తి హద్దు.
ఉత్తరం : 1వ అయిటమ్ స్థలము కొంత వరకు మరియు ఆత్మకూరు పేరయ్య గారి స్థలము కొంత వరకు హద్దు.

యీ నాలుగు హద్దుల మధ్య చ.గ. 101.6లు లేక చ.మీ. 84.9ర్లు జాయింట్ దారిలో దామాషాన జాయింట్ హక్కు చ.గ. 28.7లు లేక చ.మీ. 23.99 ర్లు, వెరశి 1, 2 అయిటమ్‌లు మొత్తం చ. 213.3లు లేక చ.మీ. 178.34ర్లు స్థలమున్నూ మరియు సదరు ఆస్తికి లోగా వున్న యావత్తు పాత రివాజు యీజుమెంటు హక్కులతో సహా. దీనిలో 5 సింగిల్ బెడ్‌రూమ్‌లు నిర్మించియున్నారు.

ఎం.దేవదానం,
అడ్వకేట్,
దత్త టవర్స్, శేషాద్రిశాస్త్రి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-2.
సెల్ : 98481 24276

విజయవాడ
ది.27-9-2023

వైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న మస్కాన్ అధికారులు

ఏరియా ఆస్పత్రిలో మస్కాన్ బృందం పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

స్థానిక ఏరియా వైద్యశాలను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మాస్కాన్ బృందం బుధవారం సందర్శించింది. చిన్న పిల్లల వార్డు, నవజాతి శిశు సంరక్షణ, ప్లే ఆఫ్ ప్రదేశాన్ని సభ్యులు సందర్శించారు. మస్కాన్ కార్యక్రమం నిర్వహణకు అవసరమైన పరిస్థితులను పరిరిలించారు. పిల్లలకు అందిస్తున్న వైద్య సదుపాయాలను అడిగి సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆసుపత్రి ప్రధాన వైద్యులు లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో మస్కాన్ అధికారులు ప్రతిమ ప్రభ, రజియా రాణి పాల్గొన్నారు.

కోర్టు హాల్లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకట లక్ష్మి

పరిసరాల పరిశుభ్రత అందరి భాధ్యత : జడ్జీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పరిసరాల పరిశుభ్రత అందరి భాధ్యతని, ఎవరు విస్మరించినా ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డి.నాగవెంకటలక్ష్మీ అన్నారు. స్థానిక 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కార్యాలయంలో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించగా జడ్జి మాట్లాడుతూ పరిస రాల పరిశుభ్రత లోపిస్తే వచ్చే దుష్ఫలితాలను ప్రజలకు వివరించాలన్నారు. కోర్టు ప్రాంగణంలో పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె.ప్రశాంతి, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి తౌషిద్ హుస్సేన్, న్యాయవాదులు, గుమాస్తాలు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు సెయింట్స్ ఆన్స్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - క్రోసూరు

సాఫ్ట్‌బాల్ అండర్-14, అండర్-17 ఉమ్మడి గుంటూరు జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక బాపట్ల జిల్లా కేంద్రమైన బాపట్లలోని విలియం బూత్ జూనియర్ కాలేజీలో నిర్వహించారు. అండర్-14 బాలికల జట్టులో పల్నాడు జిల్లా క్రోసూరు సెయింట్ ఆన్స్ విద్యార్థులు కె.రీనా సిగ్మా ఫ్లారెన్స్, కె.దీవెన ఏంజెల్, అండర్-14 బాలుర జట్టుకు వి.ఆదిత్య, అండర్-17 బాలికల జట్టుకు పి.పూజిత ఎంపికయ్యారు. ఎంపికైన వారితోపాటు పిఇటి ఎం.వెంకట్రావును సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ మేరీ రజిత అభినందించారు.

వివక్షపై పోరాడిన నవయుగ కవి చక్రవర్తి

గుర్రం జాషువాకు ఘన నివాళి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

తీవ్ర వివక్షతకు గురై ఆ వివక్షతపైనే నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా పోరాడారని ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య అన్నారు. బుధవారం స్థానిక పుతుంబాక భవన్‌లో గుర్రం జాషువా 128వ జయంతి సభనను సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పి.సూర్యప్రకాశరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాములయ్య మాట్లాడుతూ సమాజంలో ఆవహించి ఉన్న వివక్షతను రూపుమాపేందుకు జాషువా అనేక రచనలు చేశారని, 'గబ్బిలం' అందులో ఒకటని, బాగా ప్రాచుర్యమూ పొందిందని చెప్పారు. ఆనాడు తీవ్ర వివక్షతకు గురైన జాషువా పంచ కావ్యాలు చదవాలని నిర్ణయించుకుంటే అప్పటి అగ్రవర్ణాల వారు పంచ కావ్యాలు చదవడానికి వీల్లేదంటూ ఆంక్షలు విధించారని, ఆయినా పాడుబడ్డ మసీదును కేంద్రంగా చేసుకుని చదివారని గుర్తు చేశారు. జాషువా రచించిన అనేక కావ్యాలు పద్యాలు, సత్యహరిచంద్ర నాటకంలోని పద్యాలను ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, టి.పెద్దిరాజు, కళాకారులు కె.శివదుర్గారావు, సిహెచ్. నాగమల్లేశ్వరరావు, కె.సుబ్బారావు, ప్రసాదు పాడి వినిపించారు. తొలుత గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంటోనీ, కె.నాగేశ్వరరావు, జి.మస్తాన్‌రావు, కె.మాధవి పాల్గొన్నారు.

జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాములయ్య, సూర్యప్రకాశరావు

రబీకైనా నీరివ్వాలని రైతు సంఘం వినతి

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - క్రోసూరు

సాగర్ ఆయకట్టులో ఖరీఫ్‌లో సాగవ్వని పొలాలకు రబీలోనైనా సాగు నీరు ఇవ్వాలని, ఈ మేరకు వ్యవసాయ ప్రణాళికను విడుదల చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు తహశ్శీల్దార్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం ఇచ్చారు. సంఘం పల్నాడు జిల్లా నాయకులు ఎ.ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలోని దొడ్లేరు రెవెన్యూ పరిధిలో పెరికపాడు, దొడ్లేరు, ఆవులవారిపాలెం గ్రామాల పరిధిలో సాగర్ కాల్వ కింద సాగయ్యే భూమిలో 3/4 వంతు భూమి ఖాళీగా ఉందన్నారు. ఈ పొలాలకు రబీలో నీరివ్వడంతోపాటు విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై సరఫరా చేయాలని కోరారు. పంటలు సాగవ్వని నేపథ్యంలో వ్యవసాయ కూలీలకు పనుల్లేకుండా పోయాయని, వలసెళ్లాల్సిన దుస్థితి నెలకొందని, వీరికి ఉపాధి హామీ పనులు చూపాలని కోరారు. ఖరీఫ్‌లో వేసిన పైర్లకు ఆరు తడికింద అయినా నీరివ్వాలన్నారు. పంటల బీమాకు గతంలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేందని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ విధానాలకు తలొగ్గి, ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిందని, ఈ విధానాన్ని మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, నాయకులు డి.నటరాజు, కె.లక్ష్మయ్య, జె.పేతురు పాల్గొన్నారు.

నేడు యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార జాతా ర్యాలీ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

యూటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార జాతా ర్యాలీని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం నుండి యుటిఎఫ్ ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బైకు ర్యాలీ ప్రారంభం అవుతుందని, ఈ సందర్భ:గా జెండావిష్కరణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఖాశింపీరా, జమాల్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, సాంబశివరావు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి పట్టణ, మండల పరిధిలోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఫుట్‌బాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రగతి జూనియర్ కళాశాల సహకారంతో ఫుట్‌బాల్ అండర్-19 బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికను మండలంలోని నందిగామ జెడ్‌పి పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఎంపికను ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు వై.ఉదయభాస్కర్ ఎస్.సుధాకర్‌రెడ్డి, ప్రగతి జూనియర్ కళాశాల గంపా శ్రీను, ఫిజికల్ డైరక్టర్‌లు నరసింహారావు, పి.శివరామకృష్ణ పర్యవేక్షించారు. ఎంపికైనవారు అక్టోబర్ మొదటి వారంలో చిత్తూరు జిల్లాలో జరిగే 67వ ఆంధ్రప్రదేశ్ అంతరజిల్లాల పోటీల్లో పాల్గొంటారని గుంటూరు జిల్లా అండర్-19 జాయింట్ సెక్రటరీ వై.ఉదయభాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్.పిచ్చయ్య, బి.అనీల్ దత్తానాయక్, కె.కిరణ్, ఎన్.సురేష్, షేక్ కరిముల్లా, ఎం.నరసింహారావు, పి.వెంకటేశ్వరరావు, ప్రగతి కళాశాల డైరెక్టర్ పి.నరేష్, వందా కళాశాల డైరెక్టర్ అనూషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాలుర జట్టు : షేక్ మస్తాన్‌వలి, సయ్యద్ ఖాజాపీరా, ఎ.గోపీ సందీప్, ఎస్.శ్రీకాంత్, కె.నాగరాజు, జి.కౌశిక్, బి.మోషే, ఎం.ముఖేష్, షేక్ నాగనజీర్, పి.నరసింహా, ఎస్.మణికంఠ శ్రీనివాసరెడ్డి, బి.హనుమంత నాయక్, వి.విజయ్, సయ్యద్.రవూఫ్, షేక్ నాగూర్ షరీఫ్, జె.మోషే, బి.రవీంద్ర, పి.చంద్రశేఖర్. స్టాండ్ బై... పి.వెంకటేష్, ఐ.రవీంద్ర, బి.చరణ్, జె.మోషేరాజు, ఆర్.అమరనాథ్

జిల్లా బాలికల జట్టు : ఎం.జ్యోతి, పి.భూమిక, సి.హెచ్.అర్చన, పి.సాయి వెంకట హరిప్రియ, జె.శ్రీవల్లి, జి.సౌజన్య, ఎం.పవిత్రపావని, టి.రజని, ఎన్.రమ్య, కె.రమ్య, పి.రమ్యశ్రీ, కె.నేహా, కె.దుర్గా కోమలి, కె.సాయిరూప, కె.హేమారాజేశ్వరి, పి.విష్ణుప్రియ, డి.ప్రవల్లిక, టి.రమాదేవి. స్టాండ్ బై... టి.నౌమిక, కె.సుమిత్ర, కె.నీలిమ, కె.మమిత, సి.హెచ్. రూపశ్రీ.

ఖోఖో పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీలకు పెదకూరపాడుకు చెందిన సెయింట్ ఆన్స్ పాఠశాల బాలికలు ఎంపికయ్యారు. నియోజకవర్గ ఖోఖో సెలక్షన్ పోటీలు క్రోసూరులో జరిగాయి. అండర్-17, అండర్-14 విభాగంలో పోటీలు జరిగాయి. అండర్-17 విభాగంలో ఆరుగురు, అండర్-14 భాగంలో నలుగురు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం జ్యోతి తెలిపారు. ఎంపికైన వారిని ప్రత్యేకంగా అభినందించారు.

కిరణ్ కుమార్‌ను సత్కరిస్తున్న యాజమాన్యం

లక్ష్యం సాధించాలంటే పట్టుదల అవసరం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విజయానికి వ్యక్తిత్వ వికాసం తొలిమెట్టని, పనిని మనసు పెట్టి ఇష్టంపూర్వకంగా చేస్తే సులభంగా ఉండడంతో సమయం ఆదా అవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు సుపీరియర్ అగ్రి సైన్సెస్ రీజినల్ మేనేజర్ కిరణ్ కుమార్ అన్నారు. దీనికి చదువు, వ్యాపారం, కళలు ఇలా ఏది మినహాయింపు కాదన్నారు. నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ పరిధిలో గల తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి ఏడాది ఇంజినీరింగ్ విద్యార్థులకు రెండ్రోజులపాటు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఆశయ సాధనకు దృఢ నిశ్చయం ఏర్పరచుకోవాలని, ఆదర్శాలను అంటిపెట్టుకొని ముందుకు సాగాలని చెప్పారు. లక్ష్య సాధనకు నిబద్ధత, ఆలోచనలో, ప్రవర్తనలో మన సంస్కృతీ సంప్రదాయాలను తప్పక పాటించాలన్నారు. తల్లిదండ్రులతో, పెద్దలు, గురువులు, కుల మతాలకు అతీతంగా స్నేహితులతో మెలగాల్సిన విధానాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ కొత్త అంశాలు నేర్చుకునేటప్పుడు ఎంత వయసు వారైనా చిన్నపిల్లలు మాదిరి శ్రద్ధగా వినాలన్నారు. జీవితంలో సుఖదు:ఖాలు ఉంటాయని, అన్నింటినీ జయించాలంటే వ్యక్తిత్వ వికాసం ముఖ్యమని అన్నారు. ఏ సమయంలో ఎలా ఉంటున్నామో? ఎవరితో ఎలా ప్రవర్తిస్తున్నామో ప్రతి ఒక్కరూ ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ - సెక్రటరీ రావెల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని క్రమశిక్షణ అలవరచడం, నాణ్యమైన విద్య, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఉపాధి అవకాశాలకు సంబంధించిన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రజాశక్తి
గుంటూరు
5
గురువారం 28 సెప్టెంబర్ 2023

మహా కవి గుర్రం జాషువాకు ఘన నివాళి

పెదకాకానిలో

ప్రజాశక్తి -పెదకాకాని రూరల్

కుల వివక్ష పై కలంతో గళం విప్పిన కవి గుర్రం జాషువా అని సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నన్నపనేని శివాజీ మాట్లాడుతూ జాషువా రచనలన్నీ కూడా ప్రజలను అభ్యుదయ సాహిత్యం వైపు నడిపించింది అన్నారు. గబ్బిలం వంటి రచనలతో దళితులు పేదల స్థితిగతులను కళ్లకు కట్టినట్లు వివరించారన్నారు. జాషువా సాహిత్యం నేటి తరానికి ఈరోజు బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి సనాతన ధర్మం వంటి వాటిపై పోరాడే వారికి ఆయుధం వంటిది అన్నారు. జాషువా సాహిత్యంతో ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కే. సత్యనారాయణ, కే సాంబయ్య, ఎస్ నీలాంబరం, కే రాఘవయ్య, ఏ నాగేశ్వరావు, గౌరీ, వెంకట రమణ, జి రామయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నిడమర్రులో గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాల వేసి సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కుల మతాల పేరుతో గీసుకున్న పంజరానా కట్టు బడను నేను, విశ్వ నరుడను నేనని సగర్వంగా ప్రకటించిన కవి కోకిల గుర్రం జాషువా అని అన్నారు. జాషువా సామాజిక విప్లవకారుడని, సమాజంలో ఉన్న మూఢ విశ్వాసాలను తన కవిత్వం ద్వారా చీల్చి చండాడిన ప్రజాకవి గుర్రం జాషువా అని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు , వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి కే ప్రకాశరావు, రైతు సంఘం డివిజన్ నాయకులు గైరబోయిన నాగేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు కుంపటి వీరయ్య మరియదాసు తదితరులు పాల్గొన్నారు

నిడమర్రులో నివాళులర్పిస్తున్న ఎం రవి తదితరులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గుర్రం జాషువా 128వ జయంతి తెనాలి చెంచుపేటలో ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి కెవిపిఎస్ తెనాలి కమిటీ అధ్యక్షులు పి జోనేష్ అధ్యక్షత వహించారు. తొలత గుర్రం జాషువా చిత్రపటానికి సిపిఎం తెనాలి కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతు గుర్రం జాషువా తన కాలంలో ఉన్న సాంఘిక దురాచారాలను మొక్కవోని దీక్షతో ఢీకొన్నారని తెలిపారు. పీడిత, శ్రామికుల అభ్యున్నతికి కంకణం కట్టుకున్నారని అన్నారు. పేదరికం, కులవివక్షను జాషువా ఖండించారని అన్నారు. తెలుగు సాహితీ లోకంలో తన అపారమైన జ్ఞానంతో, కుల ఆధారిత వివక్ష కారణంగా అతను ఎదుర్కొన్న పోరాటం ద్వారా జాషువా తన కవిత్వాన్ని విశ్వవ్యాప్త విధానంతో రాశాడని అన్నారు. అతను కలకాలం కవిత్వం, సాహిత్యం కోసం అతను మిలీనియం కవి అని పిలవబడ్డాడని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో జె న్యూటన్, దేవరకొండ శంకర రావు, ములకా శివ సాంబిరెడ్డి షేక్ హుస్సేన్ వలి, కె రవికుమార్, జి శ్రీనివాసరావు, మంగళగిరి వెంకటేశ్వర్లు, దార్ల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల మధ్య ఉన్న సామాజిక అంతరాలను తొలగించటానికి శ్రామికుల్ని చైతన్యపరచటానికి అక్షరాన్ని ఆయుధంగా మలచుకొని పోరాడిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని జెవివి జిల్లా అధ్యక్షులు టి.జాన్‌బాబు అన్నారు. జెవివి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కాసు శాయమ్మ జిఎంసి ఉన్నత పాఠశాలలో జాషువా జయంతి సభ నిర్వహించారు. ప్రజలు కుల, మతాలుగా విడిపోకుండా విశ్వనరులుగా ఎదగాలని జాషువా కోరుకున్నారని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ అన్నారు. జాషువా సంఘ సంస్కరణపైనే కాకుండా ప్రకృతి, ప్రణయ కవితలు, దేశభక్తి, స్త్రీవాదం ఇలా అన్ని అంశాలపై కవితలు రాశారని సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఎస్.ఎం.సుభానీ పేర్కొన్నారు. జాషువా రచనలు స్త్రీలలో, శ్రామికుల్లో వెనుకబడిన కులాలలో చైతన్యం నింపాయని ఉపాధ్యాయురాలు జి.వి.పద్మావతి అన్నారు.ఉపాధ్యాయులు శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెనాలిలో

గుంటూరులో

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

6న విజయవాడలో ఆటోడ్రైవర్ల మహాధర్నా

ప్రజాశక్తి-గుంటూరు :ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అక్టోబర్ 6న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి లక్ష్మణరావు , గుంటూరు ఆటో డ్రైవర్ యూనియన్(సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి శంకర్రావు కోరారు. ఈమేరకు గుంటూరు నగరంలోని శారదా కాలనీ ఆర్చి సెంటర్, నెహ్రూ నగర్, బిఆర్ స్టేడియం బస్టాండ్, నల్ల చెరువులోని మినీ లారీ స్టాండ్, ఏటుకూరు బైపాస్ లోని లారీ స్టాండ్‌లో చలో విజయవాడ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రం జీవో నెంబర్ 21 పేరుతో మోటారు వాహన చట్ట సవరణను అమలు చేస్తూ, ఆటో డ్రైవర్స్‌ను ట్రాన్స్పోర్ట్ కార్మికులను కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు నిలువు దోపిడీ చేస్తున్నాయని ఆయన విమర్శించారు . ఆటో డ్రైవర్లకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, సిటీ పరిధిలో ఆటో స్టాండ్లకు స్థలాలను ప్రభుత్వమే కేటాయించాలని, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని, పాత వాహనాల ప్రాసెసింగ్ సబ్సిడీ ఇవ్వాలని తదితర డిమాండ్లు ప్రభుత్వం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.శ్రీనివాసరావు, ఎ.నికల్సన్ ఆటో యూనియన్ నాయకులు ఎస్.కె సైదా ఎస్ కె మస్తాన్ వలి, సమీవుల్లా, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో సామూహిక రాయబారం

ప్రజాశక్తి-గుంటూరు :యానిమేటర్ల సమస్యలు పరిశీలించాలని కోరుతూ అక్టోబర్ 10, 11 తేదీల్లో గుంటూరులో జరిగే సామూహిక రాయబార కార్యక్రమంలో యానిమేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సంఘం జిల్లా విస్తృత సమావేశం శోభారాణి అధ్యక్షతన బుధవారం పాతగుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యానిమేటర్లకు ఇస్తానన్న రూ.10వేలు వేతనం ఇవ్వాలని, మూడు సంవత్సరాల కాల పరిమితి, 45 సంవత్సరాల వయోపరిమితి నిబంధన తొలగించాలని కోరారు. బలవంతంగా యానిమేటర్స్ తో మూడు సంవత్స రాల నిండిన వారు తీర్మానం చేయాలని ఒత్తిడి చేయడం సరికాదని అన్నారు. ఫార్మింగ్, నాన్ ఫార్మింగ్ టార్గెట్లు పెట్టి కోళ్లను, మేకలు, విత్తనాలు, గేదెలు బలవంతంగా అమ్మించే విధానాన్ని మానుకోవాలని కోరారు. ప్రభుత్వ విధానాల వల్ల డ్వాక్రా సభ్యులు అప్పులు పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యానిమేటర్లకు పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని, మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన యానిమేటర్లకు 12 నెలలుగా చెల్లించాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ లో జరిగే సామూహిక రాయబార కార్యక్రమాన్ని, సమస్యలపై ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించడం జరిగింది. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి, ఆదిలక్ష్మి, దుర్గా, మహాలక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

శ్రీమేధ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-గుంటూరు: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఈనెల 26న ప్రకటించిన సిఎంఎ ఇంటర్ అండ్ ఫైనల్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు ఆలిండియా టాప్ ర్యాంకులతోపాటు, అత్యధిక పాస్ పర్సంటేజ్ సాధించారని సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలియజేశారు. సిఎంఎ ఇంటర్ విభాగంలో వంగల అశోక్‌రెడ్డి 4వ ర్యాంకు, సిఎంఎ ఫైనల్ విభాగంలో వేజండ్ల సాయిరామ్ 17వ ర్యాంకు, ఆడ్డగర్ల రమ్యశ్రీ 18వ ర్యాంకు, చేబ్రోలు అభిషేక్ 18వ ర్యాంకు సాధించారన్నారు. ఆయా విద్యార్థులను చైర్మన్ నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి అభినందించారు.

కత్తెర సురేష్ కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి - తుళ్లూరు

తాడికొండ నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త కత్తెర సురేష్ కుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా దంపతులను మండల వైసిపి నాయకులు సత్కరించారు. బుధవారం సురేష్ కుమార్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరులోని ఆయన కార్యాలయంలో వేడుకలు జరిగాయి. వైసిపి సీనియర్ నాయకులు కొప్పుల శేషగిరిరావు, మండల జెసిఎస్ కన్వీనర్ బండి ప్రసాద్, యూత్ మాజీ అధ్యక్షులు బెజ్జం రాంబాబు, కొప్పుల ఆంద్రియప్ప, పసుపులేటి అనిల్, నేలపాటి నాగేంద్రరావు,ఆరేపల్లి జోజి సురేష్ కుమార్‌కు పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు.

మురుగు కాల్వలను పరిశీలిస్తున్న సిపిఎం, రైతు సంఘం నాయకులు

తూటుకాడ, గుర్రపు డెక్కను తొలగించాలి

గుండేరు మురుగు కాల్వను పరిశీలించిన సిపిఎం, రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తూటుకాడ, గుర్రపుడెక్కలతో పూడుకుపోయిన గుండేరు మురుగు కాల్వను సత్వరమే శుభ్రం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం దావులూరు, చెముడుపాడు గ్రామాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ, రైతు సంఘం ప్రతినిధి బృందం పర్యటించారు. గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ పదిన్నర కిలోమీటర్ల నిడివి ఉన్న డ్రెయిన్ శుభ్ర పరచకపోవడం శోచనీయమన్నారు. కాల్వల్లో నిల్వలున్న తూటాకు, గుర్రావుడెక్క తొలగించకపోవడం వలన రైతులకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. అపరిశుభ్ర డ్రైన్లు కారణంగా పంటనష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ డ్రైన్లు పూడికతీత నిర్వహణ కొరకు నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. మురుగు కాల్వలు పూడికతీత పనులకొరకు గుత్తేదారులును పిలవడం జరిగిందని అధికారులు చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు మద్దన సాంబశివరావు, జిలుగు రాజేష్, పెద్ది వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న పిన్నమనేని మురళికృష్ణ తదితరులు

తండ్రి కోరికను నెరవేర్చిన తనయుడు

విజయ్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-తాడేపల్లి :సహజంగా సమాజంలో తండ్రి చనిపోతే కుటుంబసభ్యులు ఆస్తుల కోసం పాకులాడతారు. అందుకు భిన్నంగా ఓ తండ్రి తాను చనిపోతే తన శరీరాన్ని అవయవదానం కోసం ఆసుపత్రికి తరలించాలని కోరాడు. అందుకు కుమారుడు తండ్రి మరణించగానే ఆయన ఆశయాన్ని నెరవేర్చి పలువురి ప్రశంసలు అందుకున్నారు. తాడేపల్లి బైపాస్‌రోడ్డు అమరావతి ఐకాన్‌లో గొల్లకోట ప్రకాష్ కుటుంబం ఉంటుంది. ప్రకాష్ తండ్రి గొల్లకోట విజయ్ (96) బుధవారం ఉదయం కన్నుమూశారు. తండ్రి కోరిక మేరకు ఆయన కళ్లను వాసన్ ఐ కేర్ ఆసుపత్రికి దానం చేశారు. అలాగే వైద్య పరీక్షల కోసం ఆయన శరీరాన్ని మంగళగిరిలోని ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రికి తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. గొల్లకోట విజయ్‌కు ముగ్గురు సంతానం. అందులో చిన్న కుమారుడు ప్రకాష్ అమరావతి ఐకాన్ డి బ్లాక్‌లో ఉంటున్నారు. మరో కుమారుడు ముంబైలో స్థిరపడ్డారు. కుమార్తె వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో సిఐటియు ఉక్కు పరిరక్షణ చేస్తున్న పోరాటాలకు అండగా నిలుస్తున్నారు. విజయ్ మృతదేహాన్ని ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పి.మురళీకృష్ణ, ప్రజాశక్తి సిజిఎం వై.అచ్యుతరావు, ఎంబి విజ్ఞాన కేంద్రం పి.విజయ, అమరావతి ఐకాన్ మిత్ర బృందం యడ్ల బాలకృష్ణ, రియాజ్ బాష, నరసింహ, రాజశేఖర్, కోటేశ్వరరావు, విక్రమ్, రమేష్, నందగోపాల్, ప్రకాష్, వినోద్‌కుమార్, రాజు, ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్వాహకులు బిట్రా రామారావు సందర్శించి నివాళులర్పించారు.

పెదకూరపాడు నియోజకవర్గ స్కూల్ అథ్లెటిక్ గేమ్స్ ప్రారంభం

క్రోసూరు-ప్రజాశక్తి

పెదకూరపాడు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ అండర్ 17, అండర్ 14 బాల బాలికల విభాగాలలో ఆటల పోటీలను ఖోఖో పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రోసూరు నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పిటిసి సభ్యురాలు జమీల గఫూర్ , మండల పరిషత్ అధ్యక్షులు పి .కోటయ్య , స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ పందిటి శిరీష , క్రోసూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.రామాంజ నేయులు , పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి , చిలకా సురేష్ బాబు పాల్గొని అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. 100 మీటర్ల అండర్ 17 పరుగు పందెం బాలుర విభాగము లో పి. ముబీన్ ఎస్ ఆర్ కె హెచ్ స్కూల్ అమరావతి ప్రథమ స్థానంలోనూ, షేక్ నజీర్ అహ్మద్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రోసూరు ద్వితీయ స్థానంలోనూ , బాలికల విభాగంలో బి .అనూష జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాపాయిపాలెం విద్యార్థిని ప్రథమ స్థానంలోనూ, ఎం. రీమా గ్రేస్ జిల్లా పరిషత్ హై స్కూల్ అచ్చంపేట విద్యార్థిని ద్వితీయ స్థానంలోనూ,అండర్ 17లాంగ్ జంప్ బాలుర విభాగంలో ఎస్ ఆర్ కె హెచ్ హై స్కూల్ అమరావతి విద్యార్థి పి. ముబీన్ ప్రథమ స్థానం లోనూ, ఎస్.కె నజీర్ జిల్లా పరిషత్ హై స్కూల్ క్రోసూరు ద్వితీయ స్థానంలోనూ అండర్ 17 బాలురషాట్ పుట్ విభాగంలో ఎస్.కె నజీర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రోసూరువిద్యార్థి ప్రథమ స్థానంలోనూ, బాలికల షాట్ పుట్ విభాగంలో కేజీబీవీ విద్యార్థిని డి. శివ పార్వతి ద్వితీయ స్థానంలోనూ నిలిచారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-ఈపూరు

పౌష్టికరమైన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటామని జెడ్పిటిసి తుర్లపాటి చౌడయ్య అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నందు ఈపూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పౌష్టికాహార మాసో త్సవాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జడ్పిటిసి మాట్లాడుతూ గర్భ వతులు, బాలింతలు పౌష్టికాహారం తీసు కోవాలని సూచిం చారు. అనంతరం పౌష్టికాహార ప్రద ర్శనను ఆయన సంద ర్శించారు. చిరు ధాన్యాలు, ఆకుకూర లతో చేసిన వంట పదా ర్థాలను ప్రదర్శనగా ఉంచారు. అంగన్వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు చీరలు, పిల్లల బరువు, ఎత్తుకొలిచే పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్ల మీసాల చెం చయ్య, అంగన్వాడి సూపర్వైజర్లు కె.చిన్నమ్మాయి,కె రాజ్యలక్ష్మి ,వి శ్రీదేవి, ఆర్ పద్మజారాణి, ఎస్కె మస్తాన్ బి పాల్గొన్నారు.

108 వాహనానం తనిఖీ

ప్రజాశక్తి -అమరావతి: మండల కేంద్రమైన అమరావతి పంచాయతి కార్యా లయం వద్ద 108 వాహనాన్ని బుధవారం పల్నాడు జిల్లా డిస్టిక్ మేనేజర్ సుబ్బా రావు,సూపర్ వైజర్ అజయ్ తనిఖీ చేశారు. మందులు, రికార్డులు, వాహనాన్ని పరిశీ లించారు. పరికరాల పనితీరు గురించి అడిగి తెలుసు కున్నారు. 108 వాహన ఎమర్జెన్సీ టెక్నీ షియన్ కె. శ్రీహరి, పైలేటు సి హెచ్ సునీల్ పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా

ప్రత్యామ్నాయ పంటల సాగు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, వ్యవసాయ శాఖ అధికారులు ఆదే శించారు. కలెక్టర్ కార్యాలయంలోని స్పందన సమావేశం మందిరంలో బుధవారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సలహా మండలి అధ్యక్షులు కుర్రి సాయి మార్కొండా రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పొలాలను ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పం టలకు సాగు చేసేందుకు అవసరమైన విత్తనాలను రాయి తీపై అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం నీటి ఎద్దడి దృష్ట్యా పెట్టుకొని నీటి ఎద్దడిని తట్టుకునే 5 రకాల విత్తనాలను మోడల్ సాగు విధానాన్ని రెండు ఎకరాలలో నమూనాగా సాగు చేయాలని ఆదేశించారు. రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నందు నమోదు చేసి ఈకేవైసీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆద ేశించారు. జిల్లాలో అర్హులైన కౌలు రైతులకు బ్యాంకుల నుండి పంట రుణాలు పొందే విధంగా ఆయా బ్యాంకు ప్రతి నిధులతో మాట్లాడి పంట రుణాలు మంజూరయ్యేలా

ఉత్తమ రైతులను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ తదితరులు

చూడాలని ఆదేశించారు. వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు సాయి మార్కొండా రెడ్డి మాట్లాడుతూ రైతులకు సూక్ష్మ బిందు సేద్యం పై, వర్షాభావ పరిస్థితులకు అను గుణంగా రైతులు పంటలు సాగు చేసే విధంగా అవగాహన కల్పించాలని, చిరుధాన్యాలు పండించే విధంగా ప్రోత్స హించాలని సూచించారు. రైతుకు వందనం కార్యక్రమం నిర్వహించి అభ్యుదయ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి పాల్గొన్నారు.

పలు పథకాలపై సమీక్ష

పల్నాడు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు జగనన్న ఆరోగ్య సురక్ష, స్వచ్ఛత హాయ్ సేవ, మేరా మట్టి బి మేరా దేశ్ తదితర పథకాలపై జిల్లా కలెక్టర్ గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల జిల్లా అధి కారులతో, మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర వ్హించారు.

పథకాలు అమలు ఆయా శాఖల జిల్లా అధి కారులు, మండలాధికారులకు వివరించి, సచివాలయాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఎక్కడ లోపం వచ్చినా సంబంధిత అధికారులు, ఆయా పథ కాలను ప్రజలలోకి తీసుకు వెళ్లేందుకు, గ్రామ సచివాలయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

యడ్లపాడులో 'జగనన్నకు చెబుదాం'కు 27 ఫిర్యాదులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా/ యడ్లపాడు

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన సమస్యల ను మొదటి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం యడ్లపాడు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ట్రైని జిల్లా కలెక్టర్ కల్పశ్రీ లు పాల్గొని ప్రజలను సమస్యల అర్జీలు స్వీకరించారు. చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న భూమి వివాదాలు , భూమి అనుబంధ సమస్యలపై 27 అర్జీలు వచ్చాయన్నారు. ఆయా సమస్యల పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, నరసరావుపేట ఆర్డీఓ ఎం. శేషిరెడ్డి, యడ్లపాడు తహశీల్దార్ సుజాత, చిలకలూరి పేట, నాదెండ్ల మండల రెవెన్యూ అధికారులు, సచి వాలయాల సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కట్టాకృష్ణకు పలువురు నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఈ నెల 23న చిలకలూరిపేట అడ్డరోడ్ సెంటర్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇంటర్ విద్యార్థి కట్టా కృష్ణకు బ్రెయిన్‌డెడ్ అయిన విషయం తెలిసిందే. అనంతరం వైద్యుల సూచన మేరకు కృష్ణ అవయవాలను అతని తల్లిదండ్రులు దానం చేశారు. పట్టణానికి చెందిన కృష్ణ అవయవ దానంతో ఐదుగురి జీవితాల్లో వెలు గులు నింపి ఆదర్శంగా నిలిచారని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లా రావు అన్నారు. బుధవారం కృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. అతని కుటుంబాన్ని పరామర్శించారు. ఇదే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని వాజిత కుటుంబసభ్యులను కూడా ఆయన పరామర్శిం చారు. స్థానిక సుబ్బయ్యతోటలో నివ సిస్తున్న వాజిత తండ్రి షేక్ అబ్దుల్ ను కలిశారు.పట్టణంలో తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యమే కారణమని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి, చిలక లూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ తీవ్రంగా విమర్శించారు. పట్టణంలో పలుచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్లను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వాజిత, కృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై శాసన మండలి లో చర్చించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌కు లోక్‌సత్తా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్,10 ఫార్ములా సాధన కమి టీ కన్వీనర్ మాదాసు భాను ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా 10 ఫార్ములాను అమలు చేయాలని, జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ సిగ్నల్స్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వాజిత ,కృష్ణ కుటుంబాలకు తమ సంతాపం తెలిపారు.

బాధిత కుటుంబాలకు తక్షణ సాయం ఇవ్వండి

కట్టా కృష్ణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

కట్టా కృష్ణ కుటుంబానికి సంతాపం తెలియజేస్తున్నట్టు సిపిఎం పట్టణకార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్నతాధికారులు కళ్ళు తెరచి ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. ఉదయం సాయం త్రం సమయాలలో ఇండి యన్ బ్యాంక్, శ్రీనివాస సినిమా థియేటర్ వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. ఈ నెల 23న జరిగన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థిని వాజిత, అవయవదానం చేసిన కట్టా కృష్ణ కుటుంబాలకు తక్షణ సాయం కింద ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయండి: ఎమ్మెల్సి మర్రి రాజశేఖర్

రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్సీ రాజశేఖర్ తెలిపారు. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారిపై చిలకలూరిపేట వద్ద నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై శాసనమండలిలో ప్రస్తా వించినట్టు పేర్కొన్నారు. నిత్యం పాఠశాలలకు, కళాశాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారు జాతీయ రహదారిని దాటే క్రమంలో రోడ్డు ప్రమా దాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. పట్టణంలో మూడు చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. మృతి చెందిన విద్యార్థిని వాజిత కుటుంబానికి, కట్టా కృష్ణ కుటుంబానికి సంతాపం తెలిపారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న చిత్రం

భవ్యశ్రీ హంతకులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

చిత్తూరు జిల్లా విద్యార్థిని భవ్యశ్రీని హత్య చేసిన నిం దితులకు ఉరిశిక్ష విధించాలని వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు వేముల ప్రసాదరావు డిమాండ్ చేశారు. హత్యచేసిన నిందితులకు ఉరిశిక్ష విధించాలని కోరుతూ వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ర్యాలీ నిర్వ హించారు. సత్తెనపల్లి సెంటర్లోని సత్తెన్న విగ్రహం వద్ద నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లా డుతూ నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా విచారణ జరిపి వెంటనే ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ రాజకుమారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు సిహెచ్ శివరామక్రిష్ణ, రాజుపాలెం ఎంపీటీసీ బి. సాంబశివరావు, సిహెచ్. పుల్లారావు, కె.శివశంకర్, పి.అంకమ్మరావు, పి.లక్ష్మయ్య, సిహెచ్ శ్రీనివాసరావు , బి. సాంబశివరావు పాల్గొన్నారు. **సత్తెనపల్లి టౌన్:** ఇంటర్ విద్యార్థిని భవ్యశ్రీనీ హత్యచేసిన వారిని ప్రభుత్వం కటినంగా శిక్షించాలని జై భీం భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళల రక్షణే తమ ధ్యేయం అంటున్న వైసిపి ప్రభుత్వం ఈ ఘటనకు ఏం జవాబు చెబుతుందని ప్రశ్నించారు. **అచ్చంపేట:** ఆంధ్ర రాష్ట్రంలో కాలేజీకి వెళ్లే చదువుకునే ఆడపిల్లలకు భద్రత కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందా లేదా అని పెదకూరపాడు నియోజకవర్గ బీసీ మహిళ మాజీ అధ్యక్షురాలు చల్లా అనుపకళ ప్రశ్నించారు బుధవారం ఆమె ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ భవ్యశ్రీ ఘటనలో నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

లడ్డూ వేలం

క్రోసూరు-ప్రజా శక్తి

క్రోసూరు లోని విద్యా నగర్ లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని 27 కేజీ ల లడ్డు ప్రసాదాన్ని రూ.70,116 కు స్విమ్ స్కూల్ డైరెక్టర్ గోవర్ధన్ దక్కించుకున్నారు. బుధవారం నిమజ్జనం సందర్భంగా స్వామివారి లడ్డూ ప్రసాదానికి ఉమ్మడి వేలం నిర్వహించారు. సుమారు 5 గంటలపాటు ఉత్కంఠభరితంగా సాగింది.

ప్రజా వినతుల పరిష్కారమే లక్ష్యం: కలెక్టర్

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్ : ప్రజా వినతుల పరిష్కారమే లక్ష్యంగా, నిర్ణీత గడువు లోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలందించేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరి గిందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పెదకాకాని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్, సంయుక్త కలె క్టర్ జి. రాజకుమారితో కలసి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతు పెదకాకాని మండల ప్రజలు 21 అర్జీలు అందజేశారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ప్రజలు తమ ఫిర్యాదులను టోల్ ఫ్రీ నెంబర్ 1902 కు కాల్ చేసిన పిదప సదరు ఫిర్యాదు జేకేసీ పోర్టల్ లో నమోదు అవుతుందని చెప్పారు. సంబంధిత అధికారులు ఆయా ఫిర్యాదులను పరిశీలించి సహేతుకంగా పరిష్కరిస్తారని అన్నారు. మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చనే ఉద్దేశంతో మండల కేంద్రాల్లో ప్రతి బుధ, శుక్రవారాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతోందని అన్నారు. ఆర్థికపరమైన అంశాలతో ముడి పడిన ఫిర్యాదులను ప్రభుత్వానికి నివేదించి పరిష్కరిస్తామని వివరించారు. బుధవారం అందిన ఫిర్యాదులను నిర్ణీత గడువు లోగా సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ, డ్వామా, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు హరిహర నాథ్, యుగంధర్ కుమార్, వేణుగోపాల్, డిడి సోషల్ వెల్ఫేర్ మధుసూదనరావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ శ్రావణ బాబు, డిపిఒ కేశవరెడ్డి, పంచాయితీ రాజ్ ఎస్.ఇ సురేష్, ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్.ఇ బ్రహ్మయ్య, జిల్లా మత్స్య శాఖాధికారి పి. గాలి దేముడు, డిఇఒ శైలజ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలె క్టర్ జి. రాజకుమారి

రాష్ట్ర స్థాయి పోటీలకు నారాకోడూరు పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - చేబ్రోలు

రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ ఛాంపియన్ షిప్ పోటీలకు గుంటూరు జిల్లా జట్టులో ఆడేందుకు నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-17 విభాగంలో 10 మంది ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ప్రధాన ఉపాధ్యాయులు ఎం.ఏడు కొండలు తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుండి అక్టోబర్ 1 వరకు తెనాలి ఏఎస్ఎన్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయని అన్నారు. ఎంపికైన వారిలో ఆరుగురు బాలురు కె.డేవిడ్ రాజు(10వ తరగతి), ఎస్ .శివశంకర్ (10వ తరగతి) ఎ .రాఘవేంద్ర (10వ తరగతి),టి.అభినాష్ (10వ తరగతి), ఎ .యువకృష్ణ (8వ తరగతి),ఎం.బషీర్ (8వ తరగతి), నలుగురు బాలికలు డి.ఎరూష, ఎస్.అలేఖ్య, కె.వెన్నెల, పి.దేవి అలేఖ్య లు ఉన్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపా ధ్యాయులను వెంకటేశ్వరరావు, ఉమా మహేశ్వరీలను పేరెంట్స్ కమిటీ చైర్మన్ డి.అంకమ్మరావు అభినందనలు తెలిపారు.

మల్లెపాడులో పొలంబడి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రైతు భరోసా కేంద్రం పరిధిలోని మల్లెపాడులో మండల వ్యవసాయ అధికారులు డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సబ్ డివిజనల్ సహాయ వ్యవసాయ అధికారిణి ఉషారాణి కార్యక్రమాన్ని పర్యవేక్షించి మాట్లాడారు.

వృత్తి విద్యతో నైపుణ్యాల పెంపు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

వృత్తి విద్యను అభ్యసించడం ద్వారా ప్రతి వ్యక్తి తనలో దాగివున్న నైపుణ్యాలను వెలికితీయడంతో పాటు మరింతగా పెంచుకోవచ్చు అని ఐటిఐ కళాశాలల కన్వీనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళగిరి మండలం చిన్న కాకాని జంజనం మంగళాద్రి ఐటిఐ కళాశాల స్నాతకోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కళాశాల కరస్పాం డెంట్ కొల్లి పాపారావు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ గోలి రాజశేఖర్ పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' పై సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయం నుండి ముఖ్యమంత్రి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ పూనం మాల కొండయ్య, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ ఎంటి కృష్ణబాబుతో కలసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై బుధవారం వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. గుంటూరు జిల్లాలో మంగళవారం పైలెట్ గా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగిన తీరుపై జిల్లా కలెక్టర్ల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకొని సూచనలు చేశారు. ఫిరంగిపురం మండలం పొనుగుపాడులో మంగళవారం పైలెట్ గా నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య సేవ లను మెరుగ్గా అందించడంతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు చేసినట్లు కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరైన వారి ఆరోగ్య పరిస్థితిని ఫాలో అప్ చేయ డానికి కేస్ షీట్లపై మొబైల్ నెంబర్లను అందుబాటులో వుంచా లన్నారు. ఇంటింటికి సర్వేలో రిజిస్టర్ చేయించుకోకుండా నేరుగా క్యాంప్ కు హాజరయ్యే వారికి ప్రత్యేకంగా రిజిస్టర్ చేసే వెసులుబాటు కల్పించాలన్నారు. శిబిరానికి హాజరయ్యే రోగులు నిర్దేశించిన టైమ్ షెడ్యూల్ కు వచ్చేలా అవగాహన కల్పించాల్సిన అవసరం వుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి పాల్గొన్నారు. డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ శ్రావణ బాబు, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ అన్నపూర్ణ, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ జయరామకృష్ణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టవ్యతిరేకం

ప్రజాశక్తి-తాడికొండ

బాల్య వివాహాలు చట్టవ్యతిరేకం అని ఎంపిడిఒ అత్తోట దీప్తి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాల్యవివాహాల నిరోధక అధికారులతో ప్రణాళిక సమన్వయ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ బాల్యవివాహాల వలన కలిగే అనర్థాల గురించి, బాల్య వివాహాలు జరగకుండా ముందుగానే గుర్తించి ఏ విధంగా చర్యలు తీసుకోవాలనే దానిపై వివరించారు. గతంలో బాల్యవివాహం జరిగి ఇప్పటి వరకు అధికారుల దృష్టికి రాని కేసులకు సంబంధించి ఎటువంటి ప్రణాళికతో కేసులు నమోదు చేయవచ్చు, వివాహ నమోదు

ప్రక్రియ, గ్రామస్థాయి / వార్డు స్థాయి బాల్యవివాహ నిషేధిత పర్యవేక్షణ కమిటీలు, బాల పంచాయితిలు, బాల కమిటీలు సభ్యులకు ఏ విధంగా అవగాహన కల్పించాలనే అంశాలపై శిక్షణ అందించారు. అనంతరం పోషకాహార మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను అంగన్వాడీ కార్యకర్తలు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ ప్రసాద్ ఎంఇఒ టి.ఇందిర, ఎపిఎం సాంబశివరావు , ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

'మైనార్టీల అభ్యున్నతే లక్ష్యం'

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

ముస్లిం మైనార్టీల అభ్యున్నతే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాల్లో పెద్దపీట వేస్తున్నారని నియోజకవర్గ వైసిపి మసీదుల ప్రచార కమిటీ ప్రతినిధి షేక్ నాజర్ అన్నారు. వైసిపి ఆధ్వర్యంలో 'హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్ కే సాత్' అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మర్కస్ మసీదు ఆవరణలో మసీదు కమిటీ ప్రతినిధులు, సభ్యులు మసీదు ఫేష్ ఇమామ్,

మోజోన్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం 'హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్ కే సాత్' బ్రోచర్లను షేక్ నాజర్, ముస్లిం ప్రతినిధులు, మసీద్ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.కార్యక్రమంలో పట్టణ ముస్లిం మైనార్టీ మైనార్టీ అధ్యక్షుడు ముల్లా కరీం, షేక్ ఖయ్యుం, షేక్ కుద్దూస్ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రక్తదానం చేయడంవలన గుండె జబ్బులు దరిచేరవని తెనాలి ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చింతల శ్రీనివాస్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో తెనాలి రెడ్ క్రాస్ చైర్ పర్సన్ ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ, కళ్యాణ్ కుమార్, ప్రియదర్శిని కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు స్థానిక స్టేషన్ రోడ్డులో వైష్ణవి కళాశాల విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పవని ప్రియాంక ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రక్తదానం, అవయవ దానం చేయడం మరొకరికి ప్రాణం పోయడమేనని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన శిబిరంలో విద్యార్థినీ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ముమ్మలనేని భానుమతి, కోశాధికారి శ్రీమన్నారాయణ, గుంటూరు రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ షేక్ జానీ, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-దుగ్గిరాల

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేమని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యం కాపాడటంలో వారు ప్రముఖ పాత్ర వహిస్తున్నారని పేరుకలపూడి సర్పంచ్ గంపల గంగాధర్ అన్నారు. కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 15వ తేదీ నుండి అక్టోబర్ 15 వరకు వివిధ దశల్లో కొనసాగుతోంది. కార్యక్రమంలో కార్యదర్శి ఎండి నుస్రత్ సుల్తానా చుక్కపల్లివారిపాలెం కార్యదర్శి వి.స్రవంతి మహిళా పోలీస్ పి.పూర్ణిమ, క్లర్క్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల లో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-మంగళగిరి

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో తాడేపల్లి సంక్షేమ భవనం వద్ద ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను అరెస్ట్ చేసి మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాలను పరిశీలించామని, సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని, వాటిని ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు ఈ.భూషణం, రాష్ట్ర నాయకులు ఐ.రాజేష్ ఉన్నారు.

పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-దుగిరాల

రైతులు తమ భూముల కొలతలు కోసం ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగకుండా రీ సర్వే ఎంతో మేలు చేస్తుందని ప్రజా ప్రతినిధులు, అధికారులు అన్నారు. పెద్ద పాలెం గ్రామ సచివాలయంలో బుధవారం చినపాలెం కి చెందిన రైతుల భూములు రీ సర్వే చేసి వారికి పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ గ్రామ పరిధిలో 804 మంది రైతులకు చెందిన 3800 ఎకరాల పంట భూములు ఉన్నట్లు తహశీల్దార్ కె.మల్లేశ్వరి తెలిపారు. ఎంపిపి డి.సంతోష్ రూపవాణి జడ్పిటిసి ఎం. అరుణ, సర్పంచ్ పి.కృష్ణ ప్రసాద్, ఎంపిటిసి పి.సాయికృష్ణ, కార్యదర్శి వెంకటరావు,విఆర్ఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డోకిపర్రులో విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని డోకిపర్రుపరిధిలో బుధవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పిటిసి కందుల సిద్దయ్య పాల్గొని మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. అక్టోబర్ ఒకటో తేదీన ఈ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం కార్యక్రమం జరుగుతుందని గ్రామ ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు,

సాయికుమార్‌కు కరాటేలో గోల్డ్ మెడల్

అభినందించిన మేయర్ కావటి మనోహరనాయుడు

సాయికుమార్ తదితరులను అభినందిస్తున్న మేయర్

ప్రజాశక్తి - గుంటూరు

కరాటేలో అత్యుత్తమ ప్రతిభ కనబర చిన సాయికుమార్ మరిన్ని గోల్డ్ మెడల్స్ సాధించి గుంటూరు నగరానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురా వాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. గుంటూరు నగరంలోని సంపత్ నగర్ లోని శ్రీ వైష్ణవి విద్యానికేతన్ విద్యార్థి కేతావత్ సాయి కుమార్ సెప్టెంబర్ 24న తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేటలో జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ షాట్ కరాటే 2023లో బంగారు పతకం సాధించాడు. బుధవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో సాయికుమార్‌ను సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సాయి కుమార్ చిన్న వయసులోనే కరాటేలో మంచి శిక్షణ పొంది, అత్యుత్తమ ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ సాధించాడని భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించి, గుంటూరు నగరానికి మంచి పేరు సాధించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో పాటశాల ప్రిన్సిపల్ చల్లా మల్లేశ్వరి, కరాటే కోచ్ తిరుపతిరావు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు, క్రీడాకారులు

రేపటి నుండి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ ఒకటవ తేదీ వరకు మూడు రోజులుపాటు జరుగనున్న రాష్ట్రస్థాయి అండర్ 17 స్కూల్ గేమ్స్ బాల, బాలికల పోటీలకు చెంచుపేటలోని అన్నా బత్తుని సత్యన్నారాయణ స్టేడియం ముస్తాబయ్యింది. డబుల్ హార్స్ మినపగుళ్ల అధినేత, స్పోర్ట్స్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మునగాల శ్యామ్ ప్రసాద్ ఈ క్రీడలకు ఆతిధ్యమివ్వనున్నారు. సుమారు 520 మంది క్రీడాకారులు పిడి లు, శిక్షకులు పాల్గొంటునట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడలకు సంబంధించి బ్రోచర్ ను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డబల్ హార్స్ జనరల్ మేనేజర్ కృష్ణ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వినయ్ కుమార్, బి వెంకటేశ్వరరావు హ్యాండ్ బాల్ కోచ్ నాగరాజు, మార్కెట్ యార్డ్ బోర్డు మెంబర్ అచ్యుత సాంబశివరావు, కిషోర్ పాల్గొన్నారు.

అటానమస్ హోదా పత్రాన్ని చూపుతున్న విజ్ఞాన్స్ అధినేత రత్తయ్య తదితరులు

విజ్ఞాన్స్ లారాకు అటానమస్ హోదా

ప్రజాశక్తి - గుంటూరు

చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి (అటా నమస్) హోదా కల్పిస్తున్నట్లు న్యూఢిల్లీలోని యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) ఉపకార్యదర్శి గోపీచంద్ మేరుగు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా లభించడం వలన స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కోర్సులను, సొంత పాఠ్య ప్రణాళిక ఏర్పాటు చేసుకోవడంతో పాటు పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, డిగ్రీలను ప్రదానం చేయవచ్చన్నారు. అటానమస్ హోదా 2034వరకు పది సంవత్సరాలు లభించిందన్నారు. ఈ హోదాతో బహుళజాతి కంపెనీలు విస్తృతంగా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. అంతేకాకుండా విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు మెరుగైన విద్యాబోధనకు కృషి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఏం అక్రిడిటేషన్‌తో పాటు ఐదు ఇంజినీరింగ్ ప్రోగ్రామ్స్‌కు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ కూడా ఉన్నాయని తెలిపారు. అనంతరం విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అటానమస్ హోదా ధ్రువపత్రాన్ని లారా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపక సిబ్బందికి అందజేసారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో 58వ ర్యాంక్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జాతీయ స్థాయిలో 58వ ర్యాంక్, ప్రపంచ స్థాయిలో 1500వ ర్యాంక్ పొందిందని విసి ప్రొఫెసర్ పి రాజశేఖర్ బుధవారం తెలిపారు. లండన్ ఆధారిత, ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ ర్యాకింగ్స్ సంస్థ టైమ్స్ హైయ్యర్ ఎడ్యుకేషన్ (టిహెచ్ఇ) ప్రపంచ ర్యాకింగ్స్ 2023 విడుదల చేసింది. ర్యాకింగ్స్ సంస్థ విశ్వవిద్యాలయాల బోధన, పరిశోధన, అనులేఖనాలు, అంతర్జాతీయ ఔట్‌లుక్, ఆదాయం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంక్‌ను ప్రకటిస్తుందన్నారు. నాగార్జున వర్సిటీ భారతదేశంలోని 91 విశ్వవిద్యాలయాలలో 58వ ర్యాంక్‌ను ప్రపంచ వ్యాపితంగా 1904 విశ్వవిద్యాలయాలలో 1201-1500 ర్యాంక్‌లను సాధిందన్నారు. అదే విధంగా ప్రపంచవ్యాపితంగా ఎంపిక చేసిన వర్సిటీలలో టీచింగ్‌లో 207 ర్యాంక్‌ను కైవసం చేసుకుందని తెలిపారు. ఈ సందర్భంగా విశి రాజశేఖర్‌కు యూనివర్శిటీ రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద మూర్తి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ. కోఆర్డినేటర్, ర్యాంకింగ్స్, డాక్టర్ ఎస్ నాగకిషోర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఫొటోగ్రఫీలో తల్లీకొడుకులకు బంగారు పతకాలు

నిర్వాహకులు, అతిధుల నుండి బంగారు పతకాలు అందుకుంటున్న మహాలక్ష్మి,రఘు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన మహాలక్ష్మిఫొటో స్టూడియో అధినేత రాష్ట్ర తొలి మహిళా ఫొటోగ్రాఫర్ మహాలక్ష్మి, ఆమె కుమారుడు రఘులు బంగారు పతకాలు సాధించారు. ఉత్తమఛాయా చిత్రాలు తీసిన వీరిని గురువారం విజయవాడలో ఎపి సృజనాత్మక, సాంస్కృతిక శాఖ మరియు ఫొటో గ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా అండ్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పతకాలు అందజేశారు. పల్నాడు ప్రాంతా నికి తలమాని కమైన కోటప్పకొండ శివరాత్రి చిత్రాలను పోటీలలో ప్రదర్శించారు. వీరికి బంగారు పతకాలతో పాటు ప్రతిభా పురస్కా రాలుకూడా లభించాయి. ఈ పతకాలను ఇండియా ఫొటో గ్రఫీ అకాడమీ చీఫ్ తమ్మ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ వెంకటరమణ అంద చేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన తల్లి, కొడుకులను పట్టణ ప్రజలు, ఫొటోగ్రాఫర్లు అభినందనలు తెలిపారు.



ఫొటోగ్రఫీ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన కోటప్పకొండ, తిరునాళ్ల చిత్రాలు

హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజిల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్‌రావును ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈమేరకు ఎస్ఎఫ్ఐ సర్వేలో వెలుగు చూసిన సమస్యలపై బుధవారం డిఆర్ఒకు వినతిపత్రం అంద చేశారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో మౌలిక వసతులు మెరుగుపర్చాలని కోరారు. నాలుగేళ్ల డిగ్రీ విద్య వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, కొందరు చదువుతుకు దూరం అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను పున:ప్రారంభించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని, పాఠ్యపుస్తకాలు అందించాలని , హానర్స్ డిగ్రీ విధానం రద్దు చేసి, మూడేళ్ల డిగ్రీ విధానం కొనసాగించాలని, జిఒ 77 రద్దు చేయాలని, బాలికలకు హాస్టల్స్‌లో శానిటరీ ప్యాడ్స్ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, ఎస్.కె.సమీర్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్లలో పోలింగ్ కేంద్రాలు

రాజకీయపార్టీలతో సమావేశంలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అపార్ట్మెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు లోబడి పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు.బుధవారం ఉదయం కలక్టరేట్‌లోని వి.సి.సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, డిఆర్ఓ చంద్ర శేఖర్ రెడ్డితో కలిసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్-2024, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పట్టణాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అపార్ట్మెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ స్పోక్స్ పర్సన్ డాక్టరు తాతా సేవాకుమార్, బహుజన్ సమాజ్‌పార్టీ పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జి చిరుతనగండ్ల వాసు, బిజెపి జిల్లా జనరల్ సెక్రెటరీ రాచుమల్లు వెంకట భాస్కరరావు,టిడిపి కార్యాలయ సెక్రెటరీ కంచెర్ల శివరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు సంబంధించిన ప్రతి పాదనలు ఎన్నికల కమిషన్ వారికి పంపడం జరిగిందన్నారు. దేశంలో పట్టణ ప్రాంతాలలో ఓటింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల కమీషన్ వారు జారీ చేసిన సూచనలను పురస్కరించుకొని పట్టణ ప్రాంతాల్లోని అపార్ట్మెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటి ప్రాంతాల్లో పోలింగ్ బూత్ ల ఏర్పాటుకు సంబంధించి మంగళవారం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి జిల్లా ఎన్నికల అధికారులకు సూచనలు జారీ చేశారన్నారు. ఆ మేరకు ఇఆర్వోలు, ఏఇఆర్ఓ లకు సెప్టెంబర్ 29వ తేదీలోపు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకుగాను అపార్ట్మెంట్స్ నిర్వహిస్తున్న సొసైటీ వారి సమ్మతిని తప్పని సరిగా తీసుకోవాల్సి వుంటుందని, అలాగే ఎన్నికల కమిషన్ వారీ మార్గనిర్దేశాల మేరకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు వీలుండాల్సి వుంటుందన్నారు. సదరు అపార్ట్మెంట్స్ నందు సుమారు 500 పై చిలుకు ఓటర్లు కలిగి వుండాల్సి వుంటుందన్నారు. అపార్ట్మెంట్స్ వద్ద పోలింగ్ బూత్ ల ఏర్పాటు ప్రక్రియ నేపథ్యంలో డ్రాఫ్ట్ పబ్లికేషన్ అక్టోబర్ 17వ తేదీన కాకుండా అక్టోబర్ 27వ తేదికి మార్పు జరిగినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరు లలితా, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజ, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ తదిత అధికారులు పాల్గొన్నారు.